# కెరటాలు

శ్రీ కె. రామిరెడ్డి

సాయంకాలం—సముద్రతీరం.

హోరుగాలి ఉవ్వెత్తున వీస్తోంది. ఉత్తుంగ తరంగాలు పెనుకొండలుగా గట్టుమీద దాడి తీస్తున్నాయి. అవి సవాలక్షవేలు సవాలు చేసినాగాని బెదరకుండా ఎదిరిస్తూంది తీరభూమి. హతాశతో నిర్వీర్యాలై వెనుదిరిగి పోతూన్న కెరటాల మూలంగా శత్రువును భేదించే మర్మమేదో తెలిసికొన్నలాగా మరీ ఉధృతంగా మీద దూకుతున్నయి క్రొత్తక్రొత్త తరంగాలు. ఆ సంకుల సమరంలో కూలిపోతూన్న కెరటాల కుటుంబాల్లో కోటి గొంతుకలు బావురుమన్నట్టుంది అక్కడి సముద్రఘోష.

ఎందుకీ రెండు పక్షాలమధ్యా యింతటి నిష్కారణ పోరాటం! తీరభూమి ఏమి ద్రోహం చేసిందని ఇన్నికోట్ల కెరటాలు దానిపై దాడిబెట్టడానికి. కానీ, మంచి, మంచిగానే నిలువరించుకొంటుంది. లక్షన్నర చెడ్డలు దానిపై విజృంభించినా అదేమో దాని ఉత్కృష్టతను కోల్పోదు. విశ్వమంతా కూడా ఈ సామ్యమే అవుపిస్తోంటుంది. మంచీ—చెడ్డా, రెంటిమధ్యా ఓ ఘర్షణ. తాత్కాలికంగా చెడే నెగ్గినట్లు అవుపించినా శాశ్వత విజయం మంచివేపే మ్రొగ్గుతూంటుంది.

కృష్ణమూర్తికి బుర్ర వేడెక్కిపోతోంది. ఎంతసేపు ఏకాంతంగా ఆ గట్టుపై నించున్నా అతడు గ్రహించే నగ్నసత్యం అదే. మంచీ—చెడ్డా. రెంటికీ ఘర్షణ. మంచికి శాశ్వత విజయం. తన హృదయంలో కూడా అదే ఘర్షణ. లక్షా కోటి తలంపులు ఇరుపక్షాలా ఆర్భాటంగా పోరాడుతున్నయ్. కాని విజయం మంచివేపే.

అటువేపు కేశవరావు—శశి; ఇటువేపు—వంచన—ద్రోహం—వ్యభిచారం.

కూడు గుడ్డకు నోచుకోలేక అష్టకష్టాలూ పడుతూన్న తనకు జీవితంలో ఒక మార్గమంటూ చూపించాడు కేశవరావు. అంధకార బంధురంలో అటమటిస్తోండే తన బ్రదుకు ఎడారిలో ఒక ఆశాజ్యోతిని వెలిగించింది శశి. వీళ్లిద్దరిలో వంచకులెవరు? ద్రోహులెవరు? కృష్ణమూర్తికిదంతా ఒక అయోమయంగా అవుపించింది. ఇందులో తానైతాను ఏతీర్పుకూ రాలేకపోయాడు. అతనికి తోచిందల్లా ఒక్కటే. సముద్రతీరం నెగ్గింది. అలలు ఓడిపోయాయి. మంచి నెగ్గుతుంది. చెడ్డలు క్షణికాలు.

కాని, శశి యిన్నాళ్లవఱకూ ఈ విషయాన్ని ఎందుకుదాచింది? ఈనాడు ఎందుకు చెప్పాలి? చెప్పకుండా మభ్యపఱచిఉంటేనే బావుండేది. ఆ చెప్పేటప్పటి ఆమెముఖం ఎంత దీనంగా, వైవర్ణ్యంగా అవుపించింది!—ఇందులో ద్రోహం ఎవరిది? కేశవరావుదా? ఎందుకని! రెండు అనాథజీవితాల్లో ఆశాజ్యోతుల్ని వెలిగించినందుకా? కాదు! ఆయన ద్రోహికాడు. శశి అంతకన్నా కాదు. కానీ—ఏమిటీ వంచన! ఆ ప్రశ్నే కృష్ణమూర్తిని వేధిస్తోంది. దాన్ని నిర్ణయించుకోటానికనే ఏకాంతంగా సముద్రపు హోరుగాలిలో నుంచుండిపోయాడు.

శశికి అయిదేళ్లు వెళ్లకముందే తల్లిదండ్రులు ఆమెను ఈ విశాలప్రపంచానికి అప్పజెప్పి వెళ్ళిపోయారు. అప్పటినుంచీ కేశవరావుచేతుల్లోనే పెరిగి పెద్దదయింది ఆమె. ఒక్కగా ఒక అక్కకూతురిలా అనాథ అవటంమూలాన కేశవరావుకూడా దెబ్బతిన్నాడు. ఆమెనెంతో ఆప్యాయంగా పెంచాడు. నీలవేణమ్మకూడా చాల మంచిదవటంవల్ల శశికి తల్లిదండ్రులులేనిలోపం తీరిపోయింది. తన కెలాగూ బిడ్డలు లేరు కనుక శశినే తనబిడ్డలా పెంచుకుంది నీలవేణమ్మ. శశిని బాగా చదువబెట్టాలని వారిఆశ.

శశి స్కూలు ఫైనలు చదువుతోంది. క్లాసులో అన్నిట్లోనూ ఘనంగా నిలుస్తూంటుంది. చదువులో ఆమెకున్న చురుకుదనము, చొరవచూచి ఏ డాక్టరు చదువన్నా చెప్పించాలి అనుకున్నాడు కేశవరావు. నీలవేణమ్మకూడా అదే ఉద్దేశ్యాన్ని బయటబెట్టింది.

శశికి స్కూలు ఫైనలు పరీక్షలు ఇక పదిహేను రోజులుంటాయి. కాశసముద్రంనుంచి ఉత్తరం వచ్చింది. నీలవేణమ్మతల్లి చాలా అనారోగ్యంగా ఉందట. చావు బ్రదుకులమధ్య పోరాడుతూంది. త్వరలో రావాలని వ్రాశారు. నీలవేణమ్మకు ఎటూ తోచకపోయింది. తాను వెళ్ళిందంటే పరీక్షకు చదువుకునే శశికి సౌకర్యాలుండవు. హోటలు భోజనం. ఆరోగ్యం చెడుతుంది. కాని—వెళ్ళక తప్పింది కాదు. తల్లిని కడసారిగా చూడకుండా ఉండలేదు. పోతూ పోతూ శ్రద్ధగా చదువుకోవమ్మా అని చెప్పేసి వెళ్లింది శశితో.

ఆరోజు మునిసిపల్ హైస్కూలు వార్షికోత్సవం. హైస్కూలు ప్రదేశమంతా బాగా అలంకరించబడింది. ఆటల పోటీలు, వక్తృత్వపు పోటీలు, డ్రామాలు అన్నీ జరుగుతాయి. కేశవరావుకూడా వానిని చూడడానికని హాజరయ్యాడు. వక్తృత్వపు పోటీలో శశి ప్రథమబహుమతి అందుకుంది. ఆనాడు ఆమె వాగ్ధాటికి ఉపాధ్యాయులందరూ కూడా ఎంతో ప్రశంసించారు. శశి యింత తెలివిపరురాలైనందుకు ఎంతో మురిసిపోయాడు కేశవరావు. ఆమెమీద ఆరోజ తనికేదో ఒక క్రొత్తఅభిమానం పుట్టుకొచ్చింది.

ఆరాత్రి ఏడుగంటలకు శకుంతల నాటకం వుంది. దానిలో శశి శకుంతల పాత్రను ధరించింది. నాటకం చాలాబాగుంది. శశి తనపాత్రను అత్యంతమైన నేర్పుతో నిర్వహిస్తూంది. శకుంతల దుస్తుల్లో ఆమె సౌందర్యం లక్ష చంద్రులను మరపింపజేసేలా వుంది. ఆ కోలముహం, వాలుగన్నులు, చుట్టలుదీరిన పొడుగాటి వెంద్రుకలు—అన్నిటినీ మించి పదిహేనేళ్ళ యౌవనంలో హెచ్చుతగ్గులు సవరించుకొంటూన్న ఆమె శరీరలావణ్యం—ఆనాటి శకుంతలకూడా యింత అందంగా ఉండలేదేమో అనుకున్నాడు కేశవరావు. పుట్టినదాదిగా ప్రతిరోజూ చూస్తూనే ఉన్నాడు శశిని. కాని, ఈనాడు ఆమెలో ఎన్నడూ లేని ఒక నూతనత్వం ద్యోతకమవుతూంది అతనికి. ఏదో ఒక అనివార్యమైన ఆవేదన—తృష్ణ—అంకురించినట్లు అవుపించింది. నిద్రాణమైన కోరికలేవో జాగృతమౌతూవున్నాయి. వాటిని మొక్కల్లోనే త్రుంచివేయాలని విశ్వప్రయత్నం చేశాడతను. కాని—కాని—చేతగాదు. కేశవరావు ఇహ ఆ నాటకం చూడలేకపోయాడు. చక్కా లేచి ఇంటిదారి పట్టాడు.

నాటకం ముగిశాక తొమ్మిదింటికల్లా ఇల్లు చేరుకుంది శశి. ప్రక్కపై కూర్చుని ఏదో ఆలోచిస్తూన్న కేశవరావువద్దకు ఒక్కపరుగులో వచ్చి 'ఎలావుంది బావా! నాటకం? ఎప్పుడో వచ్చేశావే!' అంది మంచంమీద కూర్చుంటూ. లేతపచ్చనికోక కట్టుకుంది శశి; పూల రవిక; నాటకంలో మొహానికి వేసుకున్న రంగు ఇంకా సరిగా పోలేదు.

'చాలా బావుంది శశీ!' చేతితో తల నిమురుతూ అన్నాడు. చుట్టలు దిరిగిన వెండ్రుకల్లోని మిట్టపల్లాలు అతని చేతుల కేవో క్రొత్త క్రొత్త అనుభూతుల్ని అందిస్తున్నాయి. హృదయంలో భావాలు హోరత్తిపోతున్నాయి. శశి మొహంకేసి చూశాడు. తల వంచుకుని, కాలివేలితో నేలపై రాసుకుంటూ చిరునవ్వు నవ్వుతూంది శశి. ఆ కోలముఖం—వాలుగండ్లు—ఆ ముఖంలో ఉట్టిపడే కాంతివిన్యాసం—శకుంతల, అక్కడ కూర్చున్నది శకుంతల—శశి కాదు—శకుంతల ఎంత బావుంది. కేశవరావు బుర్రలో కోటి కోరికలు వెఱ్ఱిగొంతుకలు విచ్చి కేకలేస్తున్నాయి. లక్షమన్మథులు వాటిని వెంటాడుతూన్నారు.

'శశీ!' అవ్యక్తమైన ఆర్తనాదంతో అన్నాడు కేశవరావు.

'ఏం, బావా!' అమాయకంగా ప్రశ్నించింది రెండవ కంఠం.

'శశీ!!'—ఆ వెఱ్ఱిగొంతుక—కేశవరావు బాహువుల్లో యిరుక్కుంది శశి.

'బావా!!'— — — 'ఎంత బాగున్నావు శశీ! నీవు శకుంతలను మించావు!'—అతని రక్తకవోష్ణత రానురాను దగ్గరిస్తూంది.

బావ — కాదు, తండ్రి. చాకి పెద్దదాని

౨

చేశాడు. తనకు ఉండే దిక్కూ దశుతా అంతా అతడే! ఏం చెప్పాలి? ఏం చేయాలి??

*　　*　　*　　*

ఆ రాత్రి కేశవరావుకు నిద్రపట్టలేదు. తల పగిలి పోతోంది. ఏంపని చేశాను! ఎంతనీచానికి పాల్పడ్డాను! కన్నబిడ్డ వాస్తవానికి తనకూ ఓ కూతురుంటే శశిఅంత వుండేది. తెల్లవారింది. శశి లేచి చదువుకోవడం లేదు. కేశవరావు మెల్లగా వెళ్ళి శశి పడుకున్న రూములో లైటు వేశాడు. మంచంమీద బోర్ల పడుకున్న శశి తల పైకెత్తి చూసింది. ఆ ముఖం నల్లబడి పోయింది. కపోలాల పైన కన్నీటిధారలు విస్పష్టంగా అవుపిస్తున్నాయి. కేశవరావు హృదయంలో లక్షా నూరు ఉప్పెనలు తలలెత్తాయి. శశి ముఖం వాడిపోయింది. తన బిడ్డముఖం—తాను చేసిన ద్రోహం మూలంగా. తన కాళ్ళక్రింద భూమి గంటకు వెయ్యి మైళ్ళ వేగంతో తిరుగుతూండడం విస్పష్టంగా తోచింది. నుంచోలేకపోయాడు. వెంటనే వెళ్ళి శశి కాళ్ళపై పడి ఏడుస్తూ.

“నన్ను క్షమించాలి తల్లీ——క్షమించవూ!” అన్నాడు. కేశవరావు ఏడుసున్నాడు. శశి ‘బావా!’ అంది—మళ్ళీ ఆ అమాయకస్వరమే.

‘క్షమించవా తల్లీ!’

‘బావా! తల్లీ—తండ్రి—అంతా నీవే బావా!’

*　　*　　*　　*

శశి ఆ యేడు మంచి మార్కులతో పాసయింది. గుంటూరు కళాశాలలో చేర్చాలని కేశవరావు ప్రయత్నపడ్డాడు. కాని శశి ఎందుకనో నే నింక చదువుకోను బావా! ఇంటివద్దే ఉంటాను’, అంది. కేశవరావు, నీలవేణమ్మా ఎంతో బ్రతిమలాడారు. కాని శశి ఒవ్వుకుందికాదు. శశి ఉద్దేశ్యాన్ని కాదన లేక పోయాడు కేశవరావు.

స్కూలునుంచీ ఆగిపోయాక శశికి పెద్దపెద్ద కుటుంబాల్లోంచే ఎన్నో సంబంధాలు వచ్చాయి. కాని అవేవీ కేశవరావుకు నచ్చాయికావు. ఒక పెద్దకుటుంబంలో ఇచ్చామంటే శశికి నేను చేయాల్సిన ఉపకారమంటూ అట్టే ఉండదు. ఆమె నన్ను క్షమించడానికి వీలుండదు. అని గొప్ప గొప్పసంబంధాలనన్నీ వదులుకున్నాడు.

కేశవరావుదృష్టిలో మెదలుతూన్నదల్లా కృష్ణమూర్తి ఒక్కడే. కృష్ణమూర్తి కాస్త దగ్గరబంధువు. బీదకుటుంబానికి చెందినవాడు. పుట్టుకతోటే తల్లి చెల్లుకుంది. ఇటర్మీడియట్ పాసయ్యేలోపున తండ్రి కూడా తనను వంటరిచేశాడు. ఏదో నానాయాతనలూ పడి బి. ఎ. పాసయ్యాడు. అతనికష్టాలనుచూసి కేశవరావుకూడా అప్పటప్పటా యింతో అంతో సహాయపడుతూండేవాడు.

ఎండాకాలం సెలవులకు కృష్ణమూర్తి వచ్చాడని తెలిసి ఓరోజు ఇంటికి పిలిపించాడు కేశవరావు.

‘ఈయేడు చదువువిషయ మేమైనా ఆలోచించావా?’ నీలవేణమ్మ చేతిలోంచి కాఫీకప్పు అందుకుంటూ అన్నాడు కేశవరావు.

‘ఏమి ఆలోచించడమండీ — బి. ఏ. సాధించడమే దుస్తరమైపోయింది. ఉన్న రెండెకరాల భూమికూడా వెలచేసేశాను. ఇహ నేదైనా ఉద్యోగం చూసుకోవడం నయముగా ఉంటుంది’. కేశవరావు ఆలోచిస్తూ అలానే కాసేపుండిపోయాడు.

‘ఏదైనా ఆర్థికంగా స్థోమత గలిగితే చదువుకుంటావన్నమాట—’

అదెలా సంభవం అన్నధోరణిలో ఆశ్చర్యంగా చూశాడు కృష్ణమూర్తి.

‘నేను చాలా రోజులుగా నీతో ఓ విషయం చెబుదా మనుకుంటున్నాను—’ మళ్ళీ అన్నాడు కేశవరావు.

కృష్ణమూర్తి ఉత్కంఠగా తల పైకెత్తి చూశాడు.

‘మా శశిని నీ కిచ్చి పెళ్ళి చేద్దామని నా ఉద్దేశ్యం—అందుకు నీకు ఏదైనా అభ్యంతరమా?—’

కృష్ణమూర్తిమీద హఠాత్తుగా ఏదో పూలవర్షం కురిసినట్లు అనిపించింది. ఏమీ చెప్పలేకపోయాడు.

‘నీకు—ఏదైనా అభ్యంతర ముంటే—’

‘ఆం!—నాకేమీ అభ్యంతరము లేదండీ’ తల వంచుకుంటూ అన్నాడు కృష్ణమూర్తి.

‘అయితే— — నీవు నీకునచ్చినది చదువుకో—నీ ఖర్చు వెచ్చాలన్నీ నేను భరిస్తాను. వచ్చే యేడు పెళ్ళి ముగించేద్దాము.’

కృష్ణమూర్తి ఏమీ చెప్పలేకపోయాడు. మౌనంగా అలాగే చాలాసేపు కూర్చుండిపోయారు ఇద్దరూ.

*　　　*　　　*

కృష్ణమూర్తికి ఎం. ఏ. మొదటిసంవత్సరం గడిచిపోయింది. శెలవుల్లో శశికి, అతడికి వివాహం జరిగింది. ఆ వూళ్ళోవాళ్ళందరికీకూడా కేశవరావు లాంటి ధనికుని సహాయం లభించడం కృష్ణమూర్తి అదృష్టం అనిపించింది.

ఎం. ఏ. ముగించుకొని లయోలా కళాశాలలో లెక్చరర్ గా చేరాడు కృష్ణమూర్తి. శశితో క్రొత్తగా కాపురం పెట్టాడు మదరాసులో. కుటుంబం చాలా నయంగా సాగిపోతోంది. అతడు సంపాదించేదికాక, కేశవరావు వద్దన్నా నెలనెలా వందరూపాయలు పంపుతూంటాడు. వాళ్ళు చేయాల్సిందల్లా యింత డబ్బూ ఖర్చయ్యే మార్గాలు వెదుక్కోవడమే.

కాలచక్రం తన తీవ్ర వేగంలో రెండేళ్ళను తిరగవేసింది. కృష్ణమూర్తికి జీవితం స్వర్గతుల్యంగా సాగిపోతూంది. శశి అతణ్ణి దైవసమానునిగా సేవిస్తూంది. కేశవరావు కన్నబిడ్డలా చూసుకుంటూన్నాడు. జీవితంలో వాంఛలు ఒక్కటిగా మూర్తీభవించి ఫలించినట్లు ఒక బుడుతడు కూడా వెలశాడు. వాడి పుట్టుకనాడు కేశవరావు ఎన్నో విందులు—ఉత్సవాలు చేయించాడు. వాడికి తన తండ్రి జ్ఞాపకార్థం మాధవరావు అని పేరుపెట్టాడు. తన ఆస్తి మొత్తం వాడిపేరట వ్రాయాలన్నాడు.

ఆనాటిరాత్రి శశితో పిచ్చాపాటీ మాటాడుతూ అన్నాడు కృష్ణమూర్తి! 'మన అనాథ జీవితాలమీద ఇతనికింతగా ఆదరణ ఎందుకు కుదిరిందో! వాస్తవానికి అతణ్ణి మనము దైవసమానునిగా పూజించాలిసుంటుంది.'

అవునన్న మోస్తరులో తల వంచుకుంది శశి.

'ఇంతకూ నీవంటే అతడికెంత అభిమానం!—నీకోసం తన సర్వస్వాన్నీ త్యాగంచేయడానికైనా వెనుదీయడు!'

శశి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ప్రక్కకు తిరిగి పవిట చెంగుతో కళ్లు అద్దుకుంటూ 'అంతా మన అదృష్టం' అంది.

'ఎందుకు శశీ ఏడుస్తున్నావు?' అన్నాడు కృష్ణమూర్తి ఆశ్చర్యంగా.

'ఏమీ లేదండీ' ఆమె నిశ్శబ్దంగా ఉండిపోయింది. కృష్ణమూర్తి కూడా అట్టే పట్టుబట్టి అడుగలేదు.

మాసం రోజులు గడిచాయి. కృష్ణమూర్తిలో ఆనాడు శశి ఏడ్చేందుకుగల కారణం కనుక్కోవాలనే ఉత్కంఠ నానాటికీ అధికమౌతోంది. ఆమెలో ఏదో తీరని కోరిక ఉంది. దాన్ని కనుక్కొని తీర్చాలి అని ఆయన ఆరాటం.

ఒకనాడు శశి భోజనం వడ్డిస్తూంటే అడిగాడు.

'ఆ రోజు ఎందుకు శశీ ఏడ్చావు?'

'ఊరకేనండీ.'

'శశీ! నావద్ద రహస్యాలు దాచాలిసినంత అవసరము ఏముంది, ఇలా సంకోచిస్తున్నావు. ఇన్ని సంవత్సరాల జీవితంలోనూ నీవు నన్ను అర్థం చేసుకోలేకపోయావు.' బాధగా అన్నాడు కృష్ణమూర్తి.

శశి నుంచునుంది. ఆమె కళ్ళల్లో మళ్ళీ ధారలు కడుతున్నయి.

'శశీ! ఏమిటీ వింతవింత ప్రవర్తనలు' కోపంగా అన్నంలో చేయి కడుక్కుంటూ లేచాడు కృష్ణమూర్తి. శశి బావురుమని కృష్ణమూర్తి కాళ్ళమీద పడింది.

'క్షమించండి! నన్ను క్షమించరూ!—బావగారిని క్షమించరూ! — చెప్పండి — బావగారిని క్షమించరూ!' కన్నీళ్ళు ఏకధారగా కారిపోతున్నాయి.

కృష్ణమూర్తి కిది వింతగా—అయోమయంగా అవుపించింది.

'ఏమిటి శశీ! ఈ పిచ్చితనం.'

'అవునండి! క్షమించాలి — క్షమించరూ' కృంగిపోతోంది.

'లే శశీ! తప్పకుండా క్షమిస్తాను. అసలు ఏమి జరిగిందని నేను మిమ్మల క్షమించాలి.'

చెప్పింది శశి. జరిగిన కథంతా చెప్పింది.

దీనంగా—గద్గదంగా—కృంగి కృశించిపోతూ క్షమాపణ వేడుకుంది.

'నీవు నా దైవము. నీవద్ద నేను నిజాన్ని దాచుకొని ఉండలేకపోయాను.—క్షమిస్తావా బావా!' అంది.

కృష్ణమూర్తి అట్టే కాసేపు నుంచుండిపోయాడు. అతని ముందు మంచిచెడ్డలు విలయంగా పోరాడుతున్నాయి. శశిని మాశాడు కపోలాలమీద కన్నీళ్లు దీనంగా జాలు కడుతున్నయ్. ఎదుట గోడమీద కేశవరావు ఫోటో వ్రేలాడుతోంది. అతని ముఖం ప్రసన్నంగా శాంతంగా ఉంది. ఆ ముఖంలో దయాధర్మాలు ఉట్టిపడుతున్నయ్. కేశవరావు తన జీవితంలో వెలుగు జాడలు లేవదీశాడు. లేకపోతే తానెక్కడో పలుగాకి మూకల్లో కలిసిపోవాలిసున్నవాడు.

ఎదుట చిన్నపాపడు తొట్టెలో ప్రశాంతంగా నిద్రపోతూన్నాడు. చిరునవ్వు అతని ముఖంమీద లాస్యం చేస్తూంది. అమాయకత్వం ఆడుకుంటూఉంది.

'శశీ!'—

'బావా!'—

'క్షమిస్తాను శశీ! తప్పకుండా క్షమిస్తాను. పైకిలే.'

ఆ సాయంత్రం బీచికివెళ్ళి ఏకాంతంగా నుంచున్నాడు కృష్ణమూర్తి. ఉవ్వెత్తున కెరటాలు తీరభూమిని ఢీకొంటున్నాయి. అతని బుర్రలో మళ్ళీ ఏవేవో ఆలోచనలు పోరాడుతున్నాయి. ప్రేమ—వాత్సల్యం—భక్తి. వ్యభిచారం—కాదు—కాదు కాదు—అంధకారంలో అడుసులో బడ్డ తప్పటడుగు. అడుసు కడుగబడింది. పాదం పరిశుద్ధపరుపబడింది.

విశ్వమంతా మంచీ—చెడ్డా మధ్య పోరాటం. మంచి దృఢంగా నిలుచుంటుంది. చెడు ఓడిపోతుంది. తీర భూమి నెగ్గింది. కెరటాలు ఓడిపోయాయి. చంద్రుడిలోని కాంతిని సౌజన్యాన్ని చూడాలి—అంతుచిక్కని కలుషాన్ని కాదు వెదుకొల్సింది.

లోకాన్ని చీకట్లు ఆవరిస్తున్నాయి. విద్యుద్దీపాలు వానిని చెదరగొడుతూన్నాయి. మంచీ—చెడూ—పోరాటం. వెనక్కు తిరిగాడు కృష్ణమూర్తి.